సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం । 21 । జనవరి । 2024



అక్కచెల్లెమ్మలు ఆశలు తీరేలా..
మహిళాసాధికారతే లక్ష్యంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తోంది. డ్వాక్రా సభ్యులకు ఆర్థిక ఆసరా కల్పిస్తోంది. - 8లో



ఆడపిల్లల పట్ల వివక్ష తగదు
ఆడపిల్లల పట్ల వివక్ష చూపడం తగదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ఆడపిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. - 8లో



నాక్ గుర్తింపులో పరిశోధన పత్రాలు కీలకం - 8లో
నాక్ గుర్తింపునకు పరిశోధనా పత్రాలు కీలకమని సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అన్నారు.

గిరిజన రైతు ఇంట.. పసుపు సిరి



వీడీవీకేల్లో పసుపుగుండ తయారీని పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి (ఫైల్)

- మన్యంలో 1622 హెక్టార్లలో సాగు
- చేతికందిన పసుపు పంట
- వారపుసంతలు, మార్కెట్‌లో జోరుగా విక్రయాలు
- ఎకరాకు 25 నుంచి 30 కావిళ్ల దిగుబడి
- ఒక్కో కావిడ ధర రూ.600 నుంచి రూ.700
- వీడీవీకేల ద్వారా గిరిజనులకు గిట్టుబాటు ధర



విక్రయించేందుకు సీతంపేట మార్కెట్‌కు గిరిజన రైతులు తెచ్చిన పసుపు

సీతంపేట: ఏజెన్సీలో పసుపు సీజన్ ఆరంభమైంది. గిరిజన రైతులకు పసుపు పంట సిరులు కురిపిస్తోంది. ఏజెన్సీలోని కొండపోడు భూముల్లో గతేడాది 1337 హెక్టార్లలో పసుపు పంట సాగుచేయగా, ఈ ఏడాది 1622 హెక్టార్లలో సాగుచేశారు. పంట చేతికందడంతో వారపు సంతలు, మార్కెట్‌లలో విక్రయిస్తున్నారు. మరోవైపు ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్‌ధన్ వికాస్ కేంద్రాల్లో పసుపు కొమ్ములను గుండగా మార్చి మహిళా సంఘాలు విక్రయిస్తున్నాయి. గిరిజన రైతులు పూర్తి సేంద్రియ పద్ధతుల్లో పసుపును సాగుచేయడం, నాణ్యమైన పసుపు దిగుబడి రావడంతో కొనుగోలుకు అధిక మంది ఆసక్తి చూపుతున్నారు. సీతంపేట ఏజెన్సీలోని కుశిమి, శంభాం, జొనగ, దోనుబాయి, మర్రిపాడు, పొల్ల, కడగండి తదితర పంచాయతీల పరిధిలో పసుపు పంట అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

అంతర పంటగా..
పసుపు పంటను అధికమంది రైతులు అంతర పంటగా సాగుచేస్తున్నారు. జీడిమామిడి, మామిడి తోటల్లో ఎకరా విస్తీర్ణంలో 25 నుంచి 30 కావిళ్ల వరకు దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. పచ్చి పసుపు ఒక్కో కావిడ ధర రూ.600ల నుంచి రూ.700ల వరకు నాణ్యతను బట్టి విక్రయిస్తున్నారు. ఎండు పసుపు కావిడ ధర రూ.1500ల నుంచి 2 వేల వరకు ధర పలుకుతోంది.

జిల్లాలో పసుపు పంట సాగు వివరాలు ఇలా...

మండలం	2022–2023	2023–2024 (హెక్టార్లలో సాగు)
సాలూరు	175	225
సీతంపేట	1050	1250
మక్కువ	62	75
పాచిపెంట	50	72
మొత్తం	1337	1622

వీడీవీకేలతో మార్కెటింగ్



వీడీవీకేల ద్వారా పసుపుకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తున్నాం. పసుపు కొమ్ములను గ్రేడింగ్‌చేసి ప్రత్యేక యంత్రాల ద్వారా గుండగా తయారుచేసి ప్యాకెట్‌ల రూపంలో కిలో రూ.150 వరకు విక్రయిస్తున్నారు. ట్రైఫెడ్ ద్వారా పసుపు విక్రయాలకు చర్యలు తీసుకుంటున్నాం.
– వెంకటరమణ, వైకేపీ ఏపీడీ

ఆశాజనకంగా దిగుబడి



ఈ ఏడాది పసుపు దిగుబడులు బాగున్నాయి. ఎకరాకు 25 నుంచి 30 కావిళ్ల దిగుబడి వస్తోంది. ఒక్కో కావిడ పసుపును రూ.700కు విక్రయిస్తున్నాం. అంతరపంటగా ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.18వేల వరకు ఆదాయం వస్తోంది. ఉద్యానవన శాఖ అధికారుల సూచనల మేరకు పంటను సాగుచేస్తున్నాం.
– ఎస్.బంగారయ్య, గిరిజన రైతు

సురక్షిత ప్రయాణమే శ్రేయస్కరం



రోడ్డు భద్రత మాసోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్, తదితరులు

- రోడ్డు భద్రత మాసోత్సవాలను ప్రారంభించిన కలెక్టర్

పార్వతీపురం: ప్రయాణం సురక్షితం, సుఖవంతం కావాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల కరపత్రాలను కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు రహదారి భద్రత మాసోత్సవాలు జరుగుతాయన్నారు. రహదారి భద్రతపై ప్రతిఒక్కరూ విధిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. రహదారి భద్రత నియమాలు పాటించాలని, కుటుంబాన్ని, ఆత్మీయులను గుర్తుపెట్టుకోవాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.- జిల్లా రవాణా అధికారి సి.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా నిర్దేశించిన తేదీల్లో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శశికుమార్, పాలనాధికారి జి.సీతారాం, సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.రమేష్ కుమార్, జి.సత్యనారాయణ, ఎ.వరప్రసాద్, బి.కాశీరాంనాయక్, వైద్యాధికారి పి.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత మాసోత్సవాల షెడ్యూల్ ఇలా...
- ఈ నెల 22న రహదారి భద్రతపై వలంటీర్లను గుర్తించి పార్వతీపురం, సాలూరు, పాలకొండలలో శిక్షణ
- 23, 24 తేదీల్లో రహదారులపై గల బ్లాక్‌స్పాట్‌లపై పార్వతీపురంలో చర్చిస్తారు.
- 25, 27 తేదీల్లో సాలూరు, పాలకొండల్లో ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో రహదారి భద్రతపై అవగాహన వాక్‌థాన్
- 29న పార్వతీపురంలో డ్రైవర్లకు ఆరోగ్య, నేత్ర పరీక్షలు
- 30, 31 తేదీల్లో పార్వతీపురం, సాలూరు, పాలకొండలలో విద్యాసంస్థల నిర్వాహకులు, డ్రైవర్లు, సరుకు రవాణా డ్రైవర్లకు అవగాహన సదస్సులు
- ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు పార్వతీపురం, సాలూరు, పాలకొండలలో మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల కలిగే అనర్థాలు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ద్విచక్ర వాహన ర్యాలీ
- ఫిబ్రవరి 5, 6 తేదీల్లో పార్వతీపురంలో ఆపదలో ఆదుకొనే చట్టాలపై అవగాహన
- 8, 9 తేదీల్లో పార్వతీపురం, సాలూరులో ఆటో మొబైల్ డీలర్లను భాగస్వామ్యంచేస్తూ ఆటో డ్రైవర్లకు అవగాహన
- 12న పార్వతీపురంలో మోటార్ వాహనాల చట్టం కింద రహదారి భద్రత నియమాలపై అవగాహన
- 13న సాలూరులో ఆర్టీసీ, మ్యాక్సీక్యాబ్, మోటార్ క్యాబ్ తదితర ప్రజారవాణా సాధనాల డ్రైవర్లు, యాజమాన్యాల భాగస్వామ్యంతో మహిళలకు అవగాహన
- 14,15 తేదీల్లో పార్వతీపురం, సాలూరులలో మోటార్ వెహికల్ బీమాపై సదస్సులు
- 16న పార్వతీపురం, సాలూరులో లారీ యాజమాన్యాలను భాగస్వామ్యం చేస్తూ సరుకు రవాణా వాహనాల డ్రైవర్లకు అవగాహన
- 17న రోడ్డు భద్రత చర్యలపై పాలకొండలో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ నిర్వహణ, 19న పార్వతీపురంలో ముగింపు కార్యక్రమం ఉంటుంది.

న్యూస్‌రీల్

నవోదయ పరీక్షకు 1335 మంది హాజరు
- 304 మంది గైర్హాజరు
- డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షకు 1335 మంది విద్యార్థులు హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆయన పర్యవేక్షించారు. జిల్లాలో 9 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 1639 మంది విద్యార్థులకు 1335 మంది హాజరయ్యారని, 304 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

రోడ్డుపై ఏనుగుల గుంపు



ఘనసర–కోసలి గ్రామాల మధ్య రోడ్డుపై ఏనుగులను తిలకిస్తున్న గ్రామస్తులు

భామిని: మండలంలోని తాలాడ ఐలమ్మ తోటలో తిష్టవేసిన నాలుగు ఏనుగుల గుంపు శనివారం ఘనసర–కోసలి మధ్య రోడ్డుపైకి చేరాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఏనుగులు చూసేందుకు జనం గుమిగూడారు. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది వచ్చి ఏనుగులను కవ్వించవద్దంటూ హెచ్చరికలు జారీచేశారు. ఏనుగులు రోడ్డు నుంచి పొలాల్లోకి వెళ్లాక యథావిధిగా రాకపోకలు సాగాయి. ఏనుగుల గుంపు కొన్నాళ్లుగా ఇక్కడ పొలాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయని, శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం
- బొద్దాం, సోంపురం గ్రామాల్లో సందర్శన
- ప్రకృతి వ్యవసాయంపై ఆకట్టుకున్న నమూనా



బొద్దాంలో తొమ్మిది సార్వత్రిక సూత్రాలపై వేసిన చక్రం నమూనాను పరిశీలిస్తున్న ఎన్‌జీఓల బృందం

వేపాడ: మండలంలోని బొద్దాం, సోంపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పంటలను పది రాష్ట్రాలకు చెందిన ఎన్‌జీఓలు క్షేత్రస్థాయిలో శనివారం పరిశీలించారు. రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. బొద్దాంలో నిర్వహించిన సమావేశంలో ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులు, చీడపీడల నివారణకు వినియోగించే కషాయాలు, పంట దిగుబడులు, మార్కెటింగ్ తదితర వివరాలను ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనంద్ వివరించారు. తొమ్మిది సార్వత్రిక సూత్రాలను చక్రం రూపంలో వేసి సభ్యులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం లాభదాయకమన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సాగుసేవలను వివరించారు. కార్యక్రమంలో రీజనల్ కో.ఆర్డినేటర్ కృష్ణారావు, రీజనల్ టెక్నికల్ మెంబర్స్ ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్టీఓ హేమసుందర్, సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజనల్ కో ఆర్డినేటర్ వెంకటరావు, ఏఎన్‌సీఎఫ్ సిబ్బంది వసంత పాల్గొన్నారు.

ఎస్ఈబీ సీఐలకు స్థానచలనం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్లను బదిలీలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలో బదిలీలైన ఎస్ఈబీ సీఐల వివరాలివి.

సీఐ పేరు	ప్రస్తుత ప్రదేశం	బదిలీ అయిన ప్రదేశం
ఎల్. ఉపేంద్ర	పార్వతీపురం ఎస్ఈబీ స్టేషన్	గోపాలపురం ఎస్ఈబీ స్టేషన్
ఎస్.విజయకుమార్	పాలకొండ ఎస్ఈబీ స్టేషన్	ఇంటెలిజెన్స్ వింగ్, విజయనగరం
బి.ఈశ్వరరావు	సాలూరు ఎస్ఈబీ స్టేషన్	బి. మాడుగుల, ఎస్ఈబీ స్టేషన్
బి. జయరామ్‌రెడ్డి	కురుపాం ఎస్ఈబీ స్టేషన్	ఇంటెలిజెన్స్ వింగ్, ఏఎస్ఆర్ జిల్లా
ఎం.వి.గోపాలకృష్ణ	పార్వతీపురం ఇంటెలిజెన్స్ వింగ్	శ్రీకాకుళం ఎస్ఈబీ స్టేషన్
పి. దుర్గాప్రసాద్	సీతానగరం ఎస్ఈబీ స్టేషన్	సబ్బవరం ఎస్ఈబీ స్టేషన్
జి. సతీష్‌కుమార్	డీటీఎఫ్, పార్వతీపురం	పాడేరు ఎస్ఈబీ స్టేషన్

ప్రాణం తీసుకున్న ప్రేమికులు

- నదిలోపడి ఒకరు, రైలు కింద పడి మరొకరు మృతి
- ప్రేమ విఫలం కావడమే కారణమా...?



తోటపల్లి ప్రాజెక్టు వద్ద పద్మజ మృతదేహం

గరుగుబిల్లి: ఇద్దరూ ఒకరినొకరు ఇష్టపడ్డారు. కొన్నినెలలుగా ప్రేమలో మునిగిపోయారు. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంలో విఫలమయ్యారు. వీరిలో ఒకరికి పెద్దలు వివాహం నిశ్చయం చేయడంతో మదనపడ్డారు. తల్లిదండ్రులకు ప్రేమవిషయం చెప్పేందుకు సాహసంచేయలేక, కలిసి బతికేందుకు ధైర్యంచాలక ఒకరి తర్వాత ఒకరు ప్రాణాలు తీసుకున్నారు. ప్రేయసి తోటపల్లి డ్యామ్ నుంచి నదిలో దూకి ప్రాణాలు విడవగా, ప్రియుడు రైలుకింద పడి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటనకు సంబంధించి ట్రైనీ డీఎస్పీ మహ్మద్ అజీజ్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

కొమరాడ మండల కేంద్రానికి చెందిన పద్మజ (24), పార్వతీపురం మండలం చినమరికి గ్రామానికి చెందిన వానపల్లి శ్రావణ్‌కుమార్ (26) కొంతకాలంగా ప్రేమించుకొంటున్నారు. శ్రావణ్ ఆంధ్రా యూనివర్సిటీలో హెచ్ఆర్ చదువుతున్నాడు. ఇటీవల సంక్రాంతి సెలవులకు గ్రామానికి వచ్చిన శ్రావణ్‌కు పద్మజకు వేరే వారితో పెళ్లి నిశ్చయమైందని తెలియడంతో మనస్థాపానికి గురయ్యాడు. పద్మజకు తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధం ఇష్టపడకపోవడంతో తోటపల్లి ప్రాజెక్టు వద్ద నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న శ్రావణ్ పార్వతీపురం–కొమరాడ మధ్యన రైలు కింద పడి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పద్మజ మృతదేహం తోటపల్లి ప్రాజెక్టులో శనివారం లభించింది. స్థానిక పోలీసులు ఘటనా స్థలాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్న ట్రైనీ డీఎస్పీ తెలిపారు.

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు
ఎదిగొచ్చిన పిల్లలు చనిపోవడంతో ఇరు కుటుంబాల వారు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రేమ వ్యవహారం తెలిసి ఉంటే పెళ్లిచేసేవారమంటూ విలపిస్తున్నారు. వాస్తవం చెప్పకుండా ప్రాణం తీసుకోవడంతో ఇరు కుటుంబాల్లో విషాదం అలముకుంది.

ఎర్రకోట పరేడ్‌కు బొబ్బిలి కుర్రాడు



రెనీత్ శ్రీవత్సవ యోగానందనాయుడు

బొబ్బిలి: బొబ్బిలికి చెందిన కన్నూరు రెనీత్ శ్రీవత్సవ యోగానందనాయుడు ఈ నెల 26న ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికయ్యాడు. యోగానంద నాయుడు ప్రస్తుతం కోరుకొండ సైనిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికైన విద్యార్థిని తల్లిదండ్రులు శ్రీనివాసరావు,అపర్ణలతో పాటు పాఠశాల సిబ్బంది అభినందించారు.

సైన్స్ ఫెస్టివల్‌లో చీపురుపల్లి విద్యార్థులు

చీపురుపల్లి: జాతీయ స్థాయిలో ఈ నెల 17 నుంచి 20 వరకు హర్యానాలోని ఫరీదాబాద్‌లో గల ట్రాన్స్‌లేషన్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ (ఐఐఎస్ఎఫ్)లో చీపురుపలి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొన్నారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ, బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్, కేంద్ర అంతరిక్ష పరిశోధనా సంస్థ నేతృత్వంలో సైన్స్‌ఫెస్టివల్ సాగింది. ఏపీ నుంచి 20 మంది విద్యార్థులను సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక చేయగా అందులో చీపురుపల్లికి చెందిన జేఎస్ఎస్.శ్రీవిద్య, ఎం.ఆర్.గాయత్రీదేవి, ఎన్.సుప్రియ, డి.పార్థసారథి, టీవీఎం.సూరజ్‌లు ఉన్నారు. వీరివెంట గైడ్‌గా జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మిరియాల కృష్ణారావు వెళ్లారు. ఫోల్డ్ స్కోప్, ఫెర్న్‌రైజోం వంటి ప్రదర్శనలు తిలకించారు. ఇస్రో, విజ్ఞాన భారతి వంటి జాతీయ సంస్థలు ఏర్పాటు చేసిన మెగా ఎక్స్‌పోను విద్యార్థులు తిలకించినట్టు విద్యార్థులు తెలిపారు.

శంబర జాతరకు చకచకా ఏర్పాట్లు

- ఈ నెల 22, 23, 24 తేదీల్లో శంబర జాతర
- ఏర్పాట్లు పూర్తిచేస్తున్న అధికార యంత్రాంగం
- బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ సునీల్ షోరెన్
- చదురుగుడి, వనంగుడి క్యూకాంప్లెక్స్‌ను పరిశీలించిన జిల్లా దేవదాయశాఖ అధికారి ప్రసాదరావు



శంబర పోలమాంబ



సిద్ధమైన క్యూలైన్



జాతర ఏర్పాట్లపై చర్చిస్తున్న ఏఎస్పీ సునీల్‌షోరెన్



క్యూ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారి ప్రసాదరావు, ఈఓ సూర్యనారాయణ తదితరులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఈ నెల 22, 23, 24వ తేదీల్లో జరగనుంది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ ఈఓ వి.వి.సూర్యనారాయణ పర్యవేక్షణలో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా దేవదాయ శాఖ అధికారి ప్రసాదరావు, ఏఎస్పీ సునీల్‌షోరెన్ పరిశీలించారు. చదురుగుడి, వనంగుడి క్యూకాంప్లెక్స్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. తాగునీరు, పిల్లలకు పాలు, ప్రసాదాల పంపిణీ ఏర్పాట్లపై ఆరా తీశారు. శంబర జాతరను రాష్ట్రజాతరగా ప్రభుత్వం గుర్తించిందని, లక్షలాదిమంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సిరిమానోత్సవానికి పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు.

జాతరకు పటిష్టబందోబస్తు
పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ సునీల్‌షోరెన్ శంబర గ్రామానికి చేరుకొని జాతర బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. పార్కింగ్ స్థలాలు, క్యూకాంప్లెక్స్‌లను పరిశీలించారు. జాతరలో బందోబస్తు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై సీఐ ధనుంజయరావు, ఎస్ఐ నరసింహమూర్తితో చర్చించారు. జాతరలో సుమారు 600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్టు సీఐ ధనుంజయరావు తెలిపారు. 44 చోట్ల సీసీ కెమెరాలు అమర్చామన్నారు. జాతరకు వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రదేశాలను కేటాయించామని చెప్పారు. సిరిమానురథాన్ని నడిపే భక్తుల పేర్లు సోమవారం అందిస్తామని చెప్పగా, 50 మందికి మించరాదని ఏఎస్పీ సూచించారు.

క్లుప్తంగా

శోకసంద్రం

- అమెరికాలో మృతి చెందిన తెలుగు విద్యార్థి
- స్వగ్రామం చేరిన మృతదేహం


మృతి చెందిన సాయి నికేష్ (ఫైల్)

పాలకొండ: ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లిన పాలకొండకు చెందిన ఓ విద్యార్థి విగతజీవిగా సొంతూరుకు శనివారం చేరాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో పాలకొండ శోకసంద్రమైంది. చదువే లోకంగా జీవించిన ఆ విద్యార్థి కలలు కల్లలయ్యాయి. తమ బిడ్డపై ఆ తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... పాలకొండలోని బట్టి మఠం కాలనీలో రాకోటి వెంకటరమణ, ఆదిలక్ష్మి దంపతులు నివసిస్తున్నారు. వీరికి కుమారుడు రాకోటి సాయినికేష్(21), కుమార్తె లేఖ ఉన్నారు. సాయినికేష్ ఇటీవల ఇంజినీరింగ్ పూర్తి చేసి ఎంఎస్ కోసం గత నెల డిసెంబర్ ఆఖరులో అమెరికా వెళ్లాడు. హర్ట్‌పోర్టు సిటీలో సీక్రెడ్ యూనివర్సిటీలో సీటు రావడంతో అక్కడ ఎంఎస్‌లో చేరాడు. అమెరికా వెళ్లిన 15 రోజుల్లోనే ఈ నెల 12న శుక్రవారం తాను ఉంటున్న గదిలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. సాయినికేష్‌తో పాటు అదే గదిలో ఉంటున్న తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన మరో తెలుగు విద్యార్థి కూడా మృతి చెందాడు. విష వాయువు పీల్చడంతోనే వీరిద్దరు మృతి చెందినట్టు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. శనివారం సాయినికేష్ మృతదేహం ఇక్కడకు రాగా అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా తమ బిడ్డ మృతికి పూర్తి కారణాలు తెలియడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయినికేష్ మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన సహచర విద్యార్థులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ సంఘటనతో పాలకొండ పట్టణంలో విషాదం అలముకుంది.

ఎవరిదో ఈ బైక్...!


రోడ్డు పక్కన ఉన్న ద్విచక్ర వాహనం

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల–రణస్థలం రహదారిలో తంగుడుబిల్లి సమీపంలో ఉన్న మామిడి తోటల వద్ద ఓ ద్విచక్ర వాహనం అనుమానాస్పదంగా ఉంది. సుమారు నెల రోజుల నుంచి రహదారి పక్కనే ద్విచక్ర వాహనం ఉండడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికుల్లో పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఎవరైనా బైక్‌ను దొంగలించి అక్కడ వదిలేసి వెళ్లిపోయారా? ప్రమాదానికి గురైందా? అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పోలీసులు స్పందించి బైక్ ఎవరిదో గుర్తించాలని కోరుతున్నారు.

జూదరుల అరెస్టు

బొండపల్లి: దేవుపల్లి గ్రామ సమీపంలోని మామిడి తోటలో జూదం ఆడుతుండగా 11 మంది జూదరులను అదుపులోకి సుకోని శనివారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. జూదం ఆడుతున్న 11 మంది నుంచి రూ.9200 నగదును స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అత్యాచారం, కుల దూషణ కేసులో వ్యక్తికి జైలు

పార్వతీపురం టౌన్: అత్యాచారం, కులదూషణ కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్షను విధిస్తూ ఎస్సీ, ఎస్టీ నాల్గవ జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాష తీర్పును వెలువరించారని ఎస్పీ విక్రాంత్ పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... పార్వతీపురం రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో గల గంగాపురం గ్రామానికి చెందిన బాధితురాలు 2019 సెప్టెంబర్ 16న పార్వతీపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తాను గంగాపురం గ్రామంలో తల్లిదండ్రులతో పాటు నివాసం ఉంటున్నానని, సుమారు 8 సంవత్సరాల క్రితం పులిగుమ్మి గ్రామానికి చెందిన పువ్వల పోలి అనే అతనితో వివాహం జరిగి ఒక కుమార్తె జన్మించిందని ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త తాగుడికి బానిసై సరిగ్గా చూడకపోవడంతో కన్నవారి ఇంటికి వచ్చి ఉంటున్నానని తెలిపింది. ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన పిరిడి పోలి పరిచయమై రెండో భార్యగా స్వీకరించి తన కుమార్తెను సక్రమంగా చూసుకుంటానని నమ్మించి లోబరచి గర్భవతిని చేశాడని పేర్కొంది. 2019 ఆగస్టు 3న అబ్బాయి పుట్టగా సదరు విషయం చెప్పగా తాను చూడడానికి రాకపోవడంతో జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులతో, పెద్దలతో చెప్పి పంచాయతీ పెట్టగా విషయం తెలుసుకొని నేరస్తుడు గ్రామం విడిచి వెళ్లిపోయాడని తెలిపింది. ఈ విషయమై తనకు జరిగిన అన్యాయంపై ముద్దాయి తల్లిదండ్రులకు ప్రశ్నించగా వారు తనను కులం పేరిట దూషించడమే కాకుండా బెదిరించారని ఫిర్యాదు చేసింది. దీనిపై తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరింది. దీనిపై అప్పటి పార్వతీపురం రూరల్ ఎస్‌ఐ వీరబాబు కేసు నమోదు చేశారు. కోర్టులో కేసు రుజువు కావడంతో ముద్దాయి పిరిడి పోలికి పదేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధించినట్టు ఎస్పీ తెలిపారు.

అక్కచెల్లెమ్మల ఆశలు తీరేలా... ఆసరా

- ఆసరా నాలుగో విడత నిధుల విడుదలకు సన్నాహాలు
- డ్వాక్రా సంఘాల రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- ఈ నెల 23 నుంచి లబ్ధిదారుల ఖాతాల్లోకి వైఎస్సార్ ఆసరా మొత్తాలు
- ఇప్పటికే 91.15 శాతం గ్రూపులకు బయోమెట్రిక్ పూర్తి


నాల్గో విడత లబ్ధి పొందేందుకు అర్హత పొంది, ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు

గడిచిన మూడు విడతల్లో ఇలా..

సంవత్సరం	సంఘాలు	అందించిన మొత్తం
2020-21	16531	రూ.93.18 కోట్లు
2021-22	16646	రూ.94.32 కోట్లు
2022-23	16664	రూ.94.95 కోట్లు

పాలకొండ రూరల్: మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తూ చేయూత అందిస్తున్నారు. అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ ఆసరాతో పాటు డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ అమలు చేస్తున్నారు. ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలకు సున్నా వడ్డీకి రుణాలు అందించడంతో పాటు దశల వారీగా రుణ మాఫీ చేసి సభ్యుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం దోహదపడుతుంది. జిల్లాలో అర్హులైన డ్వాక్రా మహిళలకు ఇప్పటికే మూడు విడతల్లో రూ.282.45 కోట్ల మేర రుణమాఫీ చేశారు. త్వరలోనే నాలుగో విడత మాఫీ కింద రూ.94.88 కోట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందుకు సంబంధించి జిల్లా అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. వైఎస్సార్ ఆసరా పథకానికి అర్హులైన డ్వాక్రా మహిళల బయోమెట్రిక్ ప్రక్రియను దాదాపు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 16,667 గ్రూపుల్లో ఉన్న 1,88,080 మంది మహిళల బయోమెట్రిక్ నమోదు ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. ఇప్పటికే 91.15 శాతం బయోమెట్రిక్ పూర్తి చేశారు. సంఘాలు తీసుకున్న రుణ ప్రాప్తికి ఒక్కో మహిళ ఖాతాలో సంబంధిత నగదు ఈ నెల 23 నుంచి జమ చేయనున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే మూడు విడతల్లో డ్వాక్రా రుణమాఫీ చేయగా, ఈ నెలలో నాలుగో విడత అందించడానికి సన్నాహాలు చేస్తుండటంతో మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ పారదర్శకంగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ముక్తకంఠంతో పేర్కొంటున్నారు.

మండలాల వారీగా నాల్గో విడత వివరాలు...

మండలం	సంఘాలు	సభ్యులు	అందించనున్న మొత్తం
బలిజిపేట	1315	15102	రూ.30.45 కోట్లు
భామిని	702	8072	రూ.14.82 కోట్లు
గరుగుబిల్లి	993	11325	రూ.23.26 కోట్లు
గుమలక్ష్మీపురం	565	6498	రూ.8.56 కోట్లు
జియ్యమ్మవలస	1094	12564	రూ.22.81 కోట్లు
కొమరాడ	860	9785	రూ.17.22 కోట్లు
కురుపాం	626	7199	రూ.12.13 కోట్లు
మక్కువ	898	10245	రూ.15.52 కోట్లు
పాచిపెంట	841	9752	రూ.12.56 కోట్లు
పాలకొండ పట్టణం	1401	15306	రూ.44.71 కోట్లు
పార్వతీపురం టౌన్	1980	21628	రూ.48.07 కోట్లు
సాలూరు పట్టణం	1849	20193	రూ.39.43 కోట్లు
సీతంపేట	925	10635	రూ.21.32 కోట్లు
సీతానగరం	1140	13121	రూ.27.44 కోట్లు
వీరఘట్టం	1378	15656	రూ.39.27 కోట్లు



ఆర్థికంగా పురోగతి సాధించాం

కుమ్మరి పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మా సంఘం ద్వారా రూ.75వేలు రుణం పొందాను. ఈ నగదుతో మా కులవృత్తి చేసుకుంటున్నాం. జగనన్న ప్రభుత్వంలో గడిచిన మూడు విడతల్లో రూ.12వేల వంతున ఇప్పటి వరకూ రూ.36 వేలు ఆసరా మొత్తం అందింది. తాజాగా నాల్గో విడత మొత్తం అందనుంది. జగనన్న హయాంలో ఎటువంటి కష్టం లేకుండా ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఆర్థికంగా పురోగతి సాధించారు. ,

– కొత్తూరు జయలక్ష్మి, తుమరాడ గ్రామం, పాలకొండ మండలం


అండగా నిలిచారు..



గత టీడీపీ ప్రభుత్వంలో ఎస్‌హెచ్‌జీ సంఘాల సభ్యులకు మాయమాటలు చెప్పి మోసం చేసింది. దీంతో సంఘాల మహిళలు చేసిన అప్పులు సకాలంలో తీర్చలేక అప్పుల ఊబిలో చిక్కుకుపోయారు. జగనన్న ప్రభుత్వంలో పాలకొండ మండల పరిధిలో 938 సంఘాల పరిధిలో 10,787 మంది సభ్యులున్నారు. వీరికి సంబంధించి నాలుగు విడతల్లో రూ.20.13 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి సంఘాల సభ్యులకు అండగా నిలిచారు.

– కనుముల కల్పన, మండల మహిళా సంఘ అధ్యక్షురాలు, పాలకొండ

నేరుగా అర్హుల బ్యాంక్ ఖాతాలకు..



అర్హులైన సంఘాల సభ్యుల ఖాతాలకు ఆసరా నాల్గో విడత నిధులు త్వరలో వారి బ్యాంక్ ఖాతాలకు జమ కానున్నాయి. మన్యం జిల్లాకు సంబంధించి అర్హుల జాబితాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. జిల్లా పరిధిలో లక్షా 88 వేల పైచిలుకు అర్హులైన వారికి రూ.94.88 కోట్లను ప్రభుత్వం జమ చేయనుంది. ఈ మొత్తాలతో లబ్ధి పొందిన మహిళలు వ్యాపార పరంగా, ఆర్థికంగా మరింత బలోపేతం కావాలి.

– పి.కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం

తప్పిపోయిన పిల్లల ఆచూకీని తెలుసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

- రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

పార్వతీపురం టౌన్: తప్పిపోయిన పిల్లల ఆచూకీ కోసం చర్యలు చేపట్టాలని రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. పార్వతీపురం మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లలు, మహిళలపై ప్రత్యేక దృష్టి సారించి విచారణ పక్కాగా చేయాలన్నారు. మహిళలను వివిధ మార్గాల్లో నమ్మించి మోసం చేస్తున్న సంఘటనలు జరుగుతున్నాయని, వాటిపై నిఘా ఉండాలని సూచించారు. దేశ విదేశాలకు అక్రమ రవాణా వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించడం అవసరమని ఆయన తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, శిక్షణ డీఎస్పీ ఎండీ అజీజ్, జిల్లాలో గల సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించాలి : పీఓ


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం టౌన్: పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు విధిగా ముందుగా సందర్శించాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సాలూరు నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. ఎన్నికల నిర్వహణపై ఐటీడీఏ గిరమిత్ర సమావేశ మందిరంలో సంబంధిత తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారులు విధిగా పోలింగ్ కేంద్రాలు సందర్శించాలని, అక్కడ మౌలిక సదుపాయాలు తనిఖీ చేయాలని ఆదేశించారు. కనీస వసతులైన తాగునీరు, విద్యుత్, ర్యాంపు, మరుగుదొడ్లు తదితర వసతులు ఉండాలన్నారు. విద్యాశాఖ సంబంధిత పనులు చేపడుతుందని, సమన్వయం చేయాలని ఆయన సూచించారు. సెక్టార్ అధికారులు రూట్ పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఆడపిల్లల పట్ల వివక్ష తగదు : డీఎంహెచ్ఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ఆడపిల్లల పట్ల వివక్ష చూపడం తగదని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ఇద్దరని సమానంగా పెంచాలన్నారు. బాలికలు తమ హక్కులు గురించి తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం బాలికల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు చేపడుతుందన్నారు. ఆడ పిల్లలను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. ఆడపిల్లలు లేనిదే సమాజం లేదన్నారు. కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ ఆర్.అచ్చుతకుమారి, డెమో చిన్నతల్లి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలక్ష్మి, చదలవాడ ప్రసాద్, దిశ ఎస్‌ఐ నారాయణరావు, నేచర్ సంస్థ ప్రతినిధి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

భారీగా మద్యం సీసాల స్వాధీనం


తిప్పలవలసలో భారీగా పట్టుబడిన మద్యం సీసాలు

పూసపాటిరేగ: మండలంలోని తిప్పలవలస గ్రామంలో అనధికారంగా మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 564 మద్యం క్వార్టర్ సీసాలను సీజ్ చేసినట్టు భోగాపురం ఎస్ఈబీ సీఐ ఎంవిఆర్.అప్పారావు శనివారం తెలిపారు. తిప్పలవలస గ్రామంలో కొంత కాలంగా అనధికారంగా మద్యం అమ్మకాలు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలిస్తున్నట్టు తెలిపారు. తీర ప్రాంతంలో అనధికారంగా బెల్టు షాపులో భారీగా మద్యం పట్టుబడినట్టు పేర్కొన్నారు. ఆయనతో పాటు ఎస్ఈబీ ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బంది ఉన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


మద్యం బాటిళ్లతో ఎస్‌ఐ రామగణేష్, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గుషిణి జంక్షన్‌లో మద్యం అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. తమకి వచ్చిన ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా.. ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 24 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు నిమిత్తం కోర్టుకు అప్పగించామని ఎస్‌ఐ రామగణేష్ తెలిపారు. శుక్రవారం రాత్రి గరికిపేటలో బెల్టు షాపుపై దాడి చేసి 52 మద్యం సీసాలు సీజ్ చేశామని తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

నాక్ గుర్తింపులో పరిశోధన పత్రాలు కీలకం


అధ్యాపకులకు సూచనలు చేస్తున్న సెంచూరియన్ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి

నెల్లిమర్ల రూరల్: నాక్ గుర్తింపునకు పరిశోధనా పత్రాలు దోహదపడతాయని సెంచూరియన్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్‌లో పరిశోధన, పరిశోధనా పత్రాల తయారీ అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యశాల శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ రానున్న కాలంలో ఇదే ఒరవడిని కొనసాగించాలన్నారు. ప్రతి అధ్యాపకుడు పరిశోధనా పత్రాల తయారీలో పాల్గొని వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు మొత్తం 35 పరిశోధనా పత్రాలు సిద్ధం చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ విజయ్‌బాబు, ఐక్యూఏసీ డీన్ ప్రొఫెసర్ రమణారావు, డీన్లు ఎంఎల్ఎస్ ఆచార్యులు, సన్నీ డియోల్, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.